ఆదూరి సావిత్రి

# ఇచ్చట కోడళ్ళు తగలబెట్టబడుదురు!

"ఇచ్చట కోడళ్ళు తగల బెట్ట బడుదురు!"

ఆ బోర్డు చూసి టక్కున ఆగిపోయాడు రావణుడు....

ఆశ్చర్యంగా తలెత్తి మళ్ళీ చూశాడు. తను పొరబడలేదు. అదే బోర్డు!

కుతూహలంగా లోపలికి నడిచాడతను. లోపలంతా చాలా బిజీగా ఉన్నారు. ఆడ, మగ కలిసి పనిచేస్తున్నారు. పర్సనల్‌గా కలుసుకుని మాట్లాడే కస్టమర్స్ .... ఫోన్లమీదే డీలింగ్స్ సెటిల్ చేసుకునేవాళ్ళు ఆ ఆఫీస్‌లో వాళ్ళను ఊపిరి తిప్పుకోనివ్వటం లేదు....

ఖరీదైన బట్టలు, ఒంటి నిండా ఆభరణాలతో ఉన్న రావణుడి దగ్గరకు ఒకతను వచ్చి "మీకేసు ఎన్నిలక్షలు?" అన్నాడు.

"కేసు ఎన్ని లక్షలేమిటి? అసలు మీ ప్రొప్రయిటరు ఎవరు? నాకింకా వివరాలు కావాలి." అన్నాడు రావణుడు.

"ఆ గదిలో ఉన్నారు వెళ్ళండి. మీరెప్పుడూ మా సంస్థ గురించి వినలేదా?"

"లేదు".

"ఆశ్చర్యంగా ఉందే! దాదాపు భారత దేశమంతా శాఖోప శాఖలుగా విస్తరించి ఉంది మా సంస్థ. దీని గురించి తెలియని వాళ్ళు కూడా ఉన్నారని మేము కలలో కూడా ఊహించలేదు. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ పాప్యులారిటీ పొందింది. దీనికి మరీ పుట్టిల్లు లాంటి ప్రదేశం మూర్ఖాపురం. అమాటకొస్తే.... ఆంధ్రప్రదేశ్ అంతా దీనికి పుట్టిల్లే."

"ఈ సంస్థ చేసే పనులేమిటి?"

"పనులేం లేవు. కేవలం .... సలహా లివ్వటం. అంతే."

"ఏ పనీ లేకుండా.... ఊరికే సలహాలు మాత్రమే ఇచ్చే ఈ సంస్థ ఇంత ప్రాచుర్యాన్ని పొంది, భారత దేశమంతటా విస్తరించిందా!"

"ముందిది చెప్పండి. మీరెక్కడి నుంచొచ్చారు?"

"మాది ఈ ప్రదేశం కాదులెండి. నా పేరు రావణుడు. లంకేశ్వరుడు అని కూడా అంటారు." అన్నాడు రావణుడు సంకోచంగా.

"అంటే..... రాముడి మిసెస్ సీతాదేవిని ఎత్తుకు పోయింది మీరేగదూ?"

"ఔ......ను."

"ఇందులో అంతగా సిగ్గుపడాల్సిందేం లేదులెండి. ఇప్పుడిక్కడ అంతంత చిన్న విషయాలు గురించి ఎవరూ పట్టించుకోరు. పూర్తి బిజినెస్ గొడవల్లో తలమునకలై ఉన్నారు జనం".

"ఇంతకూ ... ఇదేం బిజినెస్సో చెప్పనేలేదు."

"మా ప్రొప్రయిటర్ గారిని కన్సల్ట్ చెయ్యండి. అదిగో.... ఆ రూంలో ఉన్నారు."

★ ★ ★ ★ ★

"హలో! నా పేరు రావణుడు."

"కూర్చోండి. బైదిబై.... నా పేరు వరప్రసాద్. ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ని. ఇంతకీ మీరు ఏ రాష్ట్రానికి చెందినవారు?"

"లంక".

"అలాగా! మా సంస్థ అవసరం మీ లంకకు కూడా ఏర్పడిందన్నమాట. అక్కడ కూడా ఓ బ్రాంచి ఓపెన్ చేస్తాంలెండి. ఎనీ హౌ... మీ కేసు ఎన్నిలక్షలది?"

"కేసేమిటి.... లక్ష లేమిటి? అసలు మీరు చేసే పని ఏమిటి? దేనిగురించి? వివరంగా చెప్పండి ముందు."

"ఓకే! జాగ్రత్తగా వినండి. ఇదొక అద్భుతమైన బిజినెస్. నయాపైస కూడా పెట్టుబడి పెట్టక్కర్లేదు. మగపిల్లల తల్లిదండ్రులు మాత్రమే ఈ బిజినెస్‌కు అర్హులు. బిజినెస్ కూడా .... వెరీ సింపుల్...

మొదట మీ అబ్బాయికి లక్షరూపాయల కట్నంతో పెళ్ళి చేస్తారు.... మీ కెపాసిటీని బట్టి అంతకన్నా ఎక్కువకావచ్చు... తక్కువకావచ్చు. కట్నం తక్కువయినా ఎక్కువయినా బిజినెస్‌లో ప్రాఫిట్ తప్ప ... లాస్ అనేది ఉండదు...

ఆ లక్షలో నుంచి పెళ్ళి ఖర్చుకు ఓ పాతిక వేలు తీసుకుని, మిగిలిన డెబ్భయి అయిదు వేలూ బ్యాంకులో వేసుకుంటారు. పెళ్ళయ్యాక, కోడల్ని కాపురానికి తీసుకొస్తారు. అక్కడి నుంచి ఆ అమ్మాయిని శోముడు మొదలెట్టాలి. "మా అబ్బాయికి మూడు లక్షలు కట్నం ఇస్తామని ఎందరెందరో వచ్చారు. మా ఖర్మకాలి.... మా నెత్తి మీద ఏదో శని కూర్చుని ఉండబట్టి... ముష్టి లక్షరూపాయలకు నిన్ను చేసుకున్నాం. ఆ కృతజ్ఞతయినా ఉండాలి గదా మీ బాబుకి? మరీ ఇంత ముదనష్టం అనుకోలేదు. వెళ్ళు. ఏం చెపుతావో... ఎలా తెస్తావో.... మీ బాబునడిగి కనీసం ఇంకో లక్షయినా లాక్కురా. ఇల్లు అమ్మెయ్యమను..... ఇంట్లో సామాను తాకట్టు పెట్టమను..... అప్పు తెమ్మను.... ఎలాగన్నా చావమను. మాకు మాత్రం ఇంకో లక్ష కావాలి". అంటూ కోడల్ని తిండి తిన నివ్వకుండా ... నీళ్ళు తాగనివ్వకుండా హింసించటం... మాటి మాటికీ పుట్టింటికి తరమటం లాంటి నాటకాలు ఓ ఆరు నెలల పాటు సాగనివ్వండి....

ఆ తరువాత.... ఓ శుభముహూర్తం చూసి కోడలి మీద ఒక డబ్బాడు కిరసనాయిలు గుమ్మరించి అగ్గిపుల్ల గీసి పడేసి, బాగా అంటుకుని మండటం ప్రారంభించాక అప్పుడు మీరు కూడా భార్యా బిడ్డలతో కలిసి కోరస్‌గా "అయ్యయ్యో! మా కోడలు కిరసనాయిలు పోసి అంటించుకుంది నాయనో. బంగారమంటి పిల్ల దేముడోయ్.... వచ్చి రక్షించండి అయ్యలారా... అమ్మలారా...." అంటూ అరుపులూ, శోకాలు మొదలెట్టండి....

ఆస్పత్రికి తీసికెళ్ళే సరికే ప్రాణాలు పోతాయి...

ఆ తరువాత కేసు స్మూత్‌గా నడవటానికి, మీరు ఏ పాపమూ ఎరుగని నిర్దోషులని రుజావు చేసుకోటానికి ఓ నలభై వేలు.... మాగ్జిమమ్ నలభైవేలు ఖర్చవుతుంది మా ఫీజుతో సహా...

ఇంత క్రితం మీరు బ్యాంకిలో వేసిన డెబ్బై అయిదు వేలల్లో ఈ ఖర్చు కూడా పోగా మీకు ముప్పై అయిదువేలు లాభం.

ఏడాది తిరక్క ముందే మీ అబ్బాయికి... ఇంకో డెబ్బై వేలు... మినిమమ్ డెబ్భైవేలు కట్నంతో ఇంకో భార్య.... ఐ మీన్ మీ ఇంటికి ఇంకో కోడలు వస్తుంది. ఈ సారి ... మనసు బాగోలేదని వంక పెట్టి పది వేలతో పెళ్ళి ఖర్చు ముగించండి.

అప్పటికి మీకు నికరలాభం తొంభై ఐదువేలు! మాగ్జిమమ్ కాదిది మినిమమ్ ఫిగర్ చెప్పానంతే. మీకు ఇంకాస్త్రమతుంటే.... మీ లాభం ఇంకా పెరుగుతుంది.....

పెట్టుబడి లేని వ్యాపారం. వేల మీద.... లక్షల మీద లాభం. ఇప్పుడు చెప్పండి. మీ కెంత మంది అబ్బాయిలు? ఏం చేస్తున్నారు? మీ ఆస్థులెంత?" అన్నాడు వరప్రసాద్.

"మైగాడ్! మైగాడ్! ఎంత దారుణం!" గుండెలు బాదుకుంటూ అన్నాడు రావణుడు.

"ఏమిటి దారుణం?"

"నేను ఒక ఆడ పిల్లని..... కనీసం తాకనయినా తాకకుండా... ఎత్తుకెళ్ళానని నన్ను అందరూ దుమ్మెత్తి పోశారు. ఆమె ఒంటి మీద చెయ్యి కూడా వెయ్యలేదు నేను. నా ముచ్చట చెల్లించమని అర్థించాను... బెదిరించానే గానీ బలాత్కారంగా ఏమీ చెయ్యలేదు. అయినా మీరంతా నన్ను యుగ యుగాలుగా శాపనార్థాలు పెడుతూ వచ్చారు. ఆడదాన్ని గౌరవించలేని మూర్ఖుడని అన్నారు. మరిప్పుడిదేమిటి? ఒక అమాయకురాలైన ఆడపిల్లని సజీవంగా దహనం చేస్తున్న మీరు నాకన్నా ఏం ఉన్నతులు? నాకన్నా నికృష్టులు కారామీరు?"

"ఎంత మాత్రం కాదు. నీకూ మాకూ ఓ ముఖ్యమైన తేడా ఉంది. నువ్వు పరాయి వాడి పెళ్ళాన్ని మోసగించి ఎత్తుకొచ్చావు. అందుకే ఆవిడ మొగుడు చేతిలో చావు దెబ్బతిన్నావు. మేము అలాంటి దొంగ పన్లు చెయ్యటల్లేదు. ఒక ఆడపిల్ల వరకట్నంతో సహా మా ఇంటి కోడలయ్యాక.... అంటే.... పూర్తిగా మా సొత్తుగా మారాకనే మేము ఆమెను తగలేస్తున్నాం. అన్ని హక్కులూ పొంది ఉన్న వాళ్ళంగనక, ఆమెను ఏం చేసుకోటాని కయినా మాకు అధికారముంది."

"మరి ... మానవత్వం లేకుండా.... " నసుగుతున్నట్లుగా అన్నాడు రావణుడు.

"మానవత్వ మేమిటి? ఇదొక అలవాటు. ప్రస్తుతం ఇది అందరికీ అలవాటయిన ఆచారం. ఆచారాన్ని పాటించటంలో తప్పులేదు....

ఒక గొర్రెను.... బ్రతికున్న గొర్రెను గ్రామదేవతకు బలి ఇస్తారు. అది కొందరి ఆచారం. దాన్ని పాటించటం విషయంలో వాళ్ళ నెవరూ ఏమీ అనరు. అమ్మవారి ఎదురుగానే అనుకో.... బ్రతికున్న గొర్రెను అమాంతం తలను తెగనరికి పారేస్తారు వాళ్ళు. అంత మాత్రాన వాళ్ళకు మానవత్వం లేదని అనగలమా? ముందుగా వాడు ఆ గొర్రెను కొని, స్వంతం చేసుకున్నాక ఇహ దాన్ని ఏదయినా చేసుకోవచ్చు.



## "ఇచ్చట కోడళ్ళు తగలబెట్ట బడుదురు!"

అలాంటిదే ఇది కూడా." అన్నాడు వరప్రసాద్.

"గొర్రె, ఆడపిల్ల ఒకటేనా?"

"ఎందుకు కాదు? దానికీ ప్రాణముంది.. దీనికీ ప్రాణముంది. బాధ, భయం ఎవరి విషయంలో నయినా ఒకటే."

"ఎంత నీచానికి దిగజారి పోయారు మీరు! దీన్ని, మిగిలిన ఆడవాళ్ళు చూస్తూ ఊరుకుంటున్నారా? మీకేవో న్యాయస్థానాలు... శిక్షలు అంటూ ఏవేవో ఉన్నాయి కాబోలు..."

"నీకు మా దేశపు ప్రజల సంగతి నేనెంత చెప్పినా అర్థం కాదుగానీ.... ఓ చిన్న సంఘటన చూపిస్తానురా. అన్నీ స్వయంగా తెలుసుకుందువుగాని."

"సరే పద."

★ ★ ★ ★ ★

"అమ్మా! నేను మా అత్తగారింటికి వెళ్ళను. నన్ను బలవంతాన అక్కడికి పంపొద్దు.-వాళ్ళు ... వాళ్ళు రాక్షసులు." వెక్కి వెక్కి ఏడుస్తూ అన్నది ఉష.

"అలా అంటే ఎలాగమ్మా! నువ్వు అత్తారింటి కెళ్ళకుండా ఇక్కడే ఉండి పోతే ఇరుగూ పొరుగూ దగ్గర .... మన వాళ్ళందరి దగ్గర పరువు పోతుంది. తల ఎత్తుకు తిరగలేం. మా అమ్మవికదూ!ఎలాగోలా సర్దుకోమ్మా." అంటూ బ్రతిమాలుతోంది ఉష తల్లి.

"వాళ్ళు నన్ను బ్రతకనివ్వరు. ఇరవై నాలుగ్గంటలూ గొడ్డు చాకిరీ చేయించుకుని, ఒక్క ముద్ద అన్నం పెట్టటానికి లక్ష తిట్లు తిడతారు. నా మొగుడు నన్ను తలుపు సందుల్లో వేళ్ళు పెట్టమని, తలుపు బలంగా వేసి నొక్కుతాడు. ఇదిగో చూడమ్మా, వేళ్ళనిండా పుళ్ళు! గరిటె కాల్చి ఒంటినిండా వాతలు పెడతారు. ఆ హింసనంతా నేను భరించలేను. ఈ సారి డబ్బు తేకుండా వస్తే చంపేస్తామని చెప్పారు వాళ్ళు. నేను ఇక్కడే ఉండి ఏదయినా ఉద్యోగం చేసుకుని బ్రతుకుతాను....."

"అయ్యో వద్దమ్మా! నువ్విలా చేస్తే ఇహ నీ చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు కావు. నలుగురిలో పరువు పోతుంది. డబ్బు ఎలాగోలా నెమ్మదిగా సర్దుతామని చెప్పు. నువ్వు వెళ్ళమ్మా!"

"నా ప్రాణంకన్నా మీకు పరువే ఎక్కువా?"

"అది కాదే తల్లీ! నీ చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు....."

"సరే వెడతాలే". నిర్లిప్తంగా అన్నది పద్దెనిమిదేళ్ళ పుత్తడి బొమ్మ ఉష.

★ ★ ★ ★ ★

"ఏమే! డబ్బుతెచ్చావా?" ఉగ్రంగా అన్నది మహంకాళి.

"లేదత్తయ్యా! వాళ్ళదగ్గర లేదుట." అన్నది ఉష.


"లేదా? అయితే నువ్వు అక్కడే చావక పోయావా? మళ్ళీ ఇక్కడి కెందుకు తగలడ్డావు?" మూలగా ఉన్న కర్ర అందుకుని ఉషని చచ్చేలా కొడుతూ అన్నాడు ఆమె భర్త మోహన్.

"నన్ను కొట్టి చంపకండి. కట్నం రూపంలో కొంత డబ్బు మొదటే తెచ్చాను. నా కన్నా మీకు డబ్బే ఎక్కువా? నేనూ, నా సర్వస్వం మీవి. ఇంకా మీకు...." వెక్కిళ్ళమధ్య అన్నది ఉష.

"ఏడిశావ్‌లే బోడీ! నువ్వు నీ సర్వస్వం ఎవడిక్కావాలే! నిన్ను చంపి పారేస్తే ఇంకో ఆడపిల్ల ఫ్రెష్‌గా వచ్చి దాని సర్వస్వం నావే నంటుంది. తెలుసా?"

"ఇహ దీనితో లాభం లేదురా! ఎన్ని తన్నినా డబ్బులు రాలవు. నువ్వో సారి ఇలారా!" అన్నది మహంకాళి.

మోహన్, మహంకాళి, ఆమె కూతురు దుర్గ, చిన్న కొడుకు జగ్గూ అంతా ఓ చోట సమావేశమయి రహస్యంగా చర్చలు జరిపి, బ్యాంకు నుంచి కొంత డబ్బు డ్రా చేసి రెడీగా ఉంచారు....




### భేదం

జవసత్వాలు
ఉడిగిన
మనిషిని
ఊరు
పొమ్మంటుంది!
చేత
రూకలు
లేని
వ్యక్తిని
కాదు
రమ్మంటుంది!

—బచ్చు వీర్రాజు

ఇల్లంతా ప్రశాంతంగా ఉంది.....

ఆదమరచి నిద్రపోతున్న ఉష కెవ్వున అరిచింది. భర్తతో సహా ఇంట్లో వాళ్ళంతా కలిసి ఆమె మీద కిరసనాయిలు పోసి నిప్పంటించారు....

మంటల మధ్య దీనంగా ఆర్తనాదాలు చేస్తోంది ఉష.....

ఆమెను హాస్పటల్‌కి తరలించారు...

ఒక్కక్షణమైనా ఆమె మంచం వదలకుండా శోకాలు పెడుతూ, ఆమె మంచితనాన్ని పొగుడుతూ... తమ దురదృష్టానికి వగస్తూ తిండి కూడా మానేసి అలమటిస్తున్నారు ఆమె భర్త, అత్త....

మరణ వాఙ్మూలం తీసుకోటానికి ఎర్రటోపీ లొచ్చాయి....

"నా భర్తకి, అత్తకి ఏమీ తెలీదు. నేనే.... నేనే.... జీవితం మీద విరక్తి పుట్టి ఆత్మహత్య చేసుకున్నాను", అని స్టేట్‌మెంటిచ్చింది ఉష.


★ ★ ★ ★ ★

అది చూసి ఆశ్చర్యంతో తల మునకలవుతూ "అదేం రోగం? అలా చెప్పిందేమిటి? ఉన్నదున్నట్టు చెపితే ఆ వెధవలకి శిక్షపడేది గదా? కనీసం ఇంకో ఆడపిల్లయినా ఆ కుటుంబపు కబంధహస్తాల్లో ఇరుక్కోకుండా రక్షింప బడేదిగదా?" అన్నాడు రావణుడు.

"అది ఖచ్చితంగా అంతే. ఈ దేశపు ఆడదానిలో ఉన్న ఈ చచ్చు సెంటిమెంటే మగాడికి కవచంగా మారి వాడిని రక్షిస్తోంది. ఇది ఇలా చెపుతుందని వాడికి ముందే తెలుసు. అందుకే నిర్భయంగా.... యథేచ్ఛగా ఆమెను తగలెయ్య గలిగాడు. నువ్విలా మాటి మాటికీ ఆశ్చర్య పోకుండా మిగిలిన తతంగాన్ని గమనించు". అన్నాడు వరప్రసాదు....

★ ★ ★ ★ ★

"ఇదిగో సూరమ్మా విన్నావా? ఆ మహంకాళి... పాపం ... బంగారం లాంటి కోడలు ఉష. ఆ పిల్ల



బెంగుళూరు శ్రీ అన్నమాచార్య సాంస్కృతిక సమితి వారు కర్ణాటక గవర్నరు శ్రీ పెండేకంటి వెంకటసుబ్బయ్యకి శ్రీ అన్నమాచార్య కీర్తనల క్యాసెట్టును సమర్పిస్తున్నప్పటి చిత్రం. శ్రీయుతులు కె. గంగరాజు (సంయుక్త కార్యదర్శి), బి. ఎ. వి. శాండిల్య (శ్రీ అన్నమాచార్య ట్రస్ట్ సంస్థాపక ట్రస్టీ), శ్రీ ఎ. రాధాకృష్ణ రాజు (ప్రధాన కార్యదర్శి), ఎన్. వి. శ్రీనివాసరావు (సంయుక్త కార్యదర్శి), ఎం. దొరస్వామి రాజు (కార్యవర్గ సభ్యులు) లను కూడా చిత్రంలో చూడవచ్చు

## "ఇచ్చట కోడళ్ళు తగలబెట్టబడుదురు!"

మీద కిరసనాయిలు పోసి తగలేసిందట!" ఆవేశంగా అన్నది శాంతమ్మ.

"అది అలాంటిదే! దాని బుద్ధి నాకు తెలుసు. నేనెప్పుడో ఊహించానిలా జరుగుతుందని. ఇలాంటి వాళ్ళని ఉరితియ్యాలసలు". అన్నది సూరమ్మ.

బజార్లో ఉన్న ఆడవాళ్ళంతా మహంకాళి కుటుంబాన్ని దుమ్మెత్తి పోశారు. డాక్టరు, పోలీసులు, బాగా డబ్బుతిని తప్పుడు స్టేట్‌మెంట్లిచ్చారని వాళ్ళని తిట్టిన తిట్టు తిట్టకుండా రాత్రింబగళ్ళు తిట్టి పోశారు.....

బ్యాంకులోంచి డ్రా చేసిన సొమ్ము అవసరమైన వాళ్ళ చేతుల్ని తడి చేసింది....

మహంకాళి, మోహన్ వగైరాలు నిర్దోషులని కోర్టు తీర్పు చెప్పింది.

ఓ ఆరు నెలలు గడిచింది....

"ఏమే శాంతమ్మా! నీ కూతుర్ని మహంకాళి కొడుకు మోహన్‌కి ఇస్తున్నావటగా?" అన్నది సూరమ్మ.

"మరేనమ్మా! పాపం! వాళ్ళు మంచివాళ్ళే! ఆ ఉషకి సుఖపడే గీత లేక అలా అర్థాంతరపు చావు చచ్చింది. దానికి ఎవడేం చేస్తాడు?

బంగారం లాంటి సంబంధం... బోలెడు ఆస్థిపాస్థులు! మామూలుగా అయితే వాళ్ళు మాకసలు అందనే అందరు. ఏదో మా పిల్ల అదృష్టం!" అన్నది శాంతమ్మ.

"మరే ఒదినా! అసలు ఆ ఉష మహా అఘాయిత్యపు పిల్లటలే. మహంకాళమ్మ ఎంత బాధపడిందనీ... వాళ్ళని అనవసరంగా రోడ్డు మీదికీడిచిందా పిల్ల. "ఈసారయినా నన్ను అర్థం చేసుకునే పిల్ల... చదువుకున్న పిల్ల దొరికితే బాగుండును". అని మోహన్ అల్లాడుతుంటే నాకు మనసంతా ద్రవించిపోయిందనుకో".

"వాళ్ళదసలు రాయల్ ఫామిలీ. ఇలాంటి చిన్నబుద్ధులు వాళ్ళకు లేవు".

"మహంకాళమ్మకి ఎంత భక్తి. ఎంత నెమ్మది.... రోజూ గుడికి వెళ్ళకుండా ఉండదు. ఇంటికెవరయినా వెడితే కాఫీ ఇవ్వకుండా ఉండదు..." అంటూ కోరస్ పాడాయి అనేక గొంతులు. ఆ గొంతులన్నీ ఆ రోజు, మహంకాళి కుటుంబాన్ని నిరసిస్తూ, డాక్టర్ల, పోలీసుల, అవినీతిపరుల లంచగొండితనాన్ని అసహ్యించుకుని దుమ్మెత్తిపోసినవే!

ఈ ఆరునెలల్లోనూ ఇంకో కొత్త న్యూస్ దొరికేసరికి మహిళా సంఘాల, వార్తాపత్రికల దృష్టి ఆటోమాటిక్‌గా దీన్నొదిలేసి, అటువేపు తిరిగింది....

ఆరు నెలలు తిరిగేసరికి ఉషకన్నా అందమైనది, డబ్బున్నది, చదువుకున్నది అయిన లీల మోహన్‌కి భార్యగా.... మహంకాళమ్మ కోడలుగా ఆ ఇంట అడుగుపెట్టింది....

* * * * *

"ఇదిగోనండీ మీ ఫీజు! మీ సలహా ప్రకారం అంతా ప్లాన్డ్‌గా... పకడ్బందీగా చేసి, స్మూత్‌గా బయటపడ్డాం. లక్షకి పైగా లాభం వచ్చింది... వస్తాం. మళ్ళీ మా చిన్నబ్బాయి పెళ్ళి అవగానే వచ్చి కలుస్తాం". అంటూ కొన్ని నోట్ల కట్టలు వరప్రసాద్‌కిచ్చి వెళ్ళిపోయింది మహంకాళి.

* * * * *

"అదీ సంగతి. ఇప్పుడర్థమయిందా మా బిజినెస్ ఏమిటో! సలహాలు చెప్పటం..... పకడ్బందీగా ప్లాన్లు చెయ్యటం మా పని. అమలుపరచటం వాళ్ళ పని." అన్నాడు వరప్రసాద్.

"మిమ్మల్ని నాలుగు తన్ని మీ బోర్డు పీకిఫారెయ్యాలి" కోపంగా అన్నాడు రావణుడు. అతనికి ఉష అమాయకమైన ముఖం గుర్తొచ్చి కడుపులో దేవుతున్నట్లనిపించింది.

"నెవ్వర్! మా సంస్థని ఎవరూ ఏమీ చెయ్యలేరు. ఇప్పుడది బాగా పాప్యులర్ అయిపోయింది ఒకవేళ నీలాంటి వాళ్ళెవరైనా ఆ పని చేసినా దీని కార్యకలపాలని మాత్రం అరికట్ట లేరు. ఇప్పటికే ఎందరో ఇలా కోడళ్ళని తగలేసే విషయంలో బాగా ఎక్స్‌పీరియన్స్ సంపాదించారు... ఇలా మా ఏజెంట్లు సర్వే సర్వత్రా వ్యాపించియున్నారు..., బోర్డు పీక గలవేమోగానీ.... నీ రాక్షస బలమంతా ఉపయోగించినా కూడా ఈ వరకట్నపు చావుల్ని నిషేధించలేవు". గర్వంగా అన్నాడు వరప్రసాద్.

"మీ నోళ్ళలో మన్నుగొట్ట! ఏం బ్రతుకులురా మీవి! థూ! మీ జాతి యావత్తూ సిగ్గుతో తలదించుకోవాల్సిన ఈ పైశాచిక చర్యని చూసి గర్వపడుతున్నావా! ఎదిరించాల్సింది పోయి, సపోర్ట్ చేసి, క్యాష్ చేసుకుంటున్నావా!

మీ జాతిని మీరే నాశనం చేసుకుంటున్న మీలాంటి వాళ్ళకన్నా అడవి మృగాలు నయం. మీ దేశంలో ఆడదానికి ఆడదే ప్రథమ శత్రువు.

ఇదేనా మీ మానవత్వం?

ఇదేనా మీరు నేర్చిన నాగరికత?

ఇదేనా మీరు సాధించిన ప్రగతి?

మీ నుంచి ఇంకా ఎన్నో నేర్చుకుని మా నాగరికతని అభివృద్ధి చేసుకోవాలని మీ మధ్యకొచ్చాను నేను.

మీకన్నా మేమే నయం!

మా రాక్షస రాజ్యంలో ఇలా ఆడదాన్ని కిరసనాయిలు పోసి అంటించరు...

అత్తింటికొచ్చిన ఆడపిల్ల, అమ్మవారికి బలి ఇవ్వబడుతున్న గొర్రె పిల్ల ఒకటే అనుకునేంత హీనస్థితికి మా వాళ్ళు దిగజారలేదు....

డబ్బు కోసం ఎంతటి నీచానికయినా దిగజారే సిగ్గుమాలిన జాతి కాదు మాది....

మీ నాగరికతకో నమస్కారం....

ఇలాంటి సిగ్గుమాలిన అభివృద్ధి మాకొద్దు....

ఇంతకన్నా.... మేము ఎప్పటిలాగా ఉండటమే మేలు.

గుడ్‌బై!

గుడ్‌బై ఫరెవ్వర్!" అంటూ చటుక్కున ఆకాశంలో కెగిరి మాయమయిపోయాడు రావణుడు.

"పీడ మొహం! ఇలాంటి కూతలు చాలా విన్నాం. ఇంత మాత్రానికి నిరుత్సాహపడితే... ఇహ మా గొప్పతనమేముంది? ఈ కాస్తకే సిగ్గుపడిపోయి బిజినెస్ మూసేసుకుంటాననుకున్నాడు గాబోలు. పూర్ ఫెలో!" అనుకుంటూ బోర్డు మీద కర్చీఫ్‌తో సుతారంగా అద్ది లోపలికెళ్ళిపోయాడు వరప్రసాద్. □